# .... భరతవాక్యం ....

కీ॥ శే॥ పూడిపెద్ది వెంకటరమణయ్య

సుదేవుడను పేదబ్రాహ్మణుడు కుచేలునివలె పెద్దకుటుంబము గలవాడు.

ఆ నాడు భిక్షాటనమునకు గ్రామమంతా తిరిగి తిరిగి రెండుయామములకు ఇలువరము చేరుకొని, అలసి తన యింటిగుమ్మమున కూలబడి, తన నిస్సహాయత తలంచికొని, లోపలకు పోలేక మానలేక చింతాక్రాంతుడై విలపించుచుండ, శ్రీమన్నారాయణుడు వానిగోల విని లక్ష్మీసహాయమున వృద్ధ బ్రాహ్మణవేషము ధరించి, ఖగవాహనుడై వచ్చి దూరమున వాహనము డిగ్గి సుదేవుని చేరవచ్చి 'నీవు బ్రాహ్మణుడవే గాని, దైవభక్తి లేనివాడవయినావు. ఇంత దారిద్ర్యమనుభవించుచున్నను, దైవమును తలంపకున్నావు. దైవచింతన చేయుము శ్రీమన్నారాయణు నారాధింపుము, సత్యనారాయణవ్రతము చేయుము.'

అంతర్ధానమయినాడు.

బ్రాహ్మణుడు, ధైర్యము తెచ్చికొని నారాయణ నామస్మరణము చేయుచు ఇంట్లో ప్రవేశించి, భార్యాపుత్రులకు దైవసత్యమును చెప్పి అందరును భజనకీర్తన చేయుదురు.

మరునాడు, హెచ్చుగా గ్రామస్థులా బ్రాహ్మణుని బిలిచి ధనమిస్తారు. దానిని తీసికొనివచ్చి తానూ భార్యాపుత్రులూ, శుచులై ఉపవాసదీక్షతో సాయంసమయమున వ్రతమాచరించుచుండగా కట్టెలమ్మువాడు భవదాసు వస్తాడు. వ్రతము చూచి ప్రసాదము స్వీకరించి మరునాడు తానును ఆ వ్రతము చేయును. వీడును నిరుపేద. భార్యా తానూ చుట్టుగుడిసెలో జీవింతురు.

ఒకనాడు ఉల్కాముఖుడు వేటాడు నెపంబున ఆ పరిసరములకు వచ్చి అంతకుముందు ఇలువరములుగా నున్న సుదేవునియొక్కయు భవదాసునియొక్కయు ఇండ్లు పెద్దభవనములై యుండుట చూచి తన మంత్రియైన సుమతివలన వారి వ్రతదీక్ష వలన వారైశ్వర్యవంతులై సంతానవంతులు నగుట యెరింగి, తనకు బిడ్డలు లేమికి నొచ్చుకొని, ఈ వ్రతోదంతము విని ఉల్కాముఖుడు, గంగాతీరమున వ్రతము చేయును. భార్యతోగూడ, ఆ తీరమున దిగిన పడవలలోని సరకులు ఇంటికి గొనిపోవచ్చిన సాధుసెట్టి ఈ వ్రతాటోపం చూచి ఏమిటని రాజపురోహితు నడుగ నాతడును - వ్రతవిధానమును చెప్పును.

అక్కడే సాధుసెట్టి తాను సంతానవంతుడయిన యెడల ఈ వ్రతము చేయుదునని మొక్కుకొని, ఇంటికి పోవును. సాధుసెట్టి క్రీడామందిరమున, భార్యయగు లీలావతితో సవిలాసముగ, శృంగార మొలికించుచు, ప్రసంగవశమున వ్రతవిషయం భార్యకు చెప్పి కోమటి ఇకమత్తుగ సంతానము కలిగిననే వ్రతము చేయుదునని మరిసెను. తొమ్మిదినెలలనాటికి, సాధువునింట పుత్రికా జననమయినది.

బిడ్డని తొట్టెలో పెట్టి యూచుచు భర్తకామె సౌందర్యమునూ సౌకుమార్యమునూ వర్ణించి చెప్పూచూ లీలావతి వ్రతము చేయవలెనని భర్తకు జ్ఞాపకం చేయును. ఇంతటితో నయినదా? బిడ్డ యెదుగవలదా? కళావతి వివిధాలంకృతయై చెలికత్తెలతో ఉద్యానమున ఆటపాటల ప్రొద్దుపుచ్చుచుండ, తల్లి చూచి, ఆనందించి భర్తకు బిడ్డను చూపి వర్ణించి చెప్పి, అల్లారుముద్దుగ పెరిగి కళావతియుక్త వయసు వచ్చినదైనది, నాథా నాటి వ్రతమో—

అబ్బ! ఏమి వ్రతము తీరుబాటే లేదు. రూపాయీలు లెక్కించుకొని లెక్కలు చూచుకున్నసరికి ప్రొద్దు చాలదు. ఇంతకీ ధనం వెచ్చించి ఇప్పుడు వ్రతం చేసేక కళావతికి మంచిమగడు దొరకకపోతే వానికొరకెంత ధనం వెచ్చించాలో తగినవరుడు దొరికి కళావతికి వివాహమయిన తరువాత వ్రతం చేద్దాం, డబ్బుతో పనా? మరొకటా? అంటాడు.

లీలావతి బదులు చెప్పక ఊరకుండును.

సాధుసెట్టి భవనంలో హాలు, (ఇనుప్పెట్టెలూ, గుమాస్తాలూ)

నేలను తివాసీ వేసికొని ముందర రూపాయీ

ల కొట్టిపెట్టుకొని, లెక్కించుచు ఆనందంగా ఆ ధనమును పొగడి పాడుచుండును.

పురోహితుడు సుశర్మ సుందరగుప్తునితో ప్రవేశించి వాని గుణగణాలు రూపసంపదా వర్ణించి కళావతికి తగిన వరునిగా చూపును.

సాధుసెట్టి వాని నెగాదిగ పరీక్షించి ఇల్లరిక ముండుమని కోరి పిల్లనిచ్చి వివాహము చేయును.

నాగవెల్లి నాడు తిరుగా బంధువులను సాగనంపు సమయాన లీలావతి వ్రత మాచరించమని భర్తను కోరును. అత డామె మాటలకు బదులు చెప్పక విన్నియు విననియట్లు నటించి అవలకు దాటి వేయును.

చేయునది లేక లీలావతి విచారించును.

విష్ణులోకమున శ్రీదేవి భర్తృసేవాపరాయణ యయ్యు, జాలిగా నవ్వును. నారాయణుడు ఉలికిపడి కారణమడుగును.

సాధువు తనయెడ చూపిన నిరసనమునకు నవ్వితిననియు తాను వానియింట నిక నుండ నొల్లననియు విష్ణువుతో చెప్పును.

అట్లయిన నిదిగో! వానికి తగిన శాస్తి చేయుమని, తన ఖగవాహనుని పిలిచి ఆజ్ఞ యిచ్చును.

గరుత్మంతుడును వల్లెయని, నారాయణునియొద్ద శెలవుగైకొని భూలోకమునకు వచ్చి, చంద్రకేతు మహారాజనగరున ప్రవేశించి, వాని కిరీటాంగదములనెత్తికొనిపోయి వచ్చిన సామగ్రిని ఉంచికొన బోవుచున్న సాధువు నోడిలో వానిని బడవేయును. సాధువును కృపణుడగుట దైవము దానుడై తనకన్ని యిస్తున్నాడని తలంచి, ఆ కిరీటమును ధరించి, భుజకీర్తులను ధరించి, అక్కడ నీటిలో నీడ చూచుకొనుచుండును.

తలారులు వెతగుచు వచ్చి కిరీటాంగదములు కోమటి యెత్తుకొనివచ్చెనని వానిని బంధితుని చేసి, పడవల సమాంతము పట్టుదురు.

సాధువును అల్లునికూడ చంద్రకేతుడు బంధితుల చేసి, వారి ధనమంతయు నపహరించును.

ఇచ్చట లీలావతి కళావతులు, నిరుపేదలై తమ భర్తలు రాకుండుటకు పరితపించుచుండురు పొరుగువారిని తమ యింట్లో.

